
సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



సోమశిలలో 72.5 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 72.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 4500 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.80,720
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,297
3శాతం జీఎస్టీతో	రూ.7,516
సవర (8గ్రా)	రూ.60,128

గరిష్టం/కనిష్టం
26.4 /26.0

వాతావరణం

జిల్లాలోని ఒకట్రెండు చోట్ల కొద్దిపాటి వర్షాలు శుక్రవారం కురిసే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 95 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడిగా అనిల్



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ పొలిటికల్‌ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సభ్యుడిగా మాజీ మంత్రి అనిల్‌కుమార్‌ యాదవ్‌ను పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనను గురువారం విడుదల చేసింది. కాగా తనను నియమించిన జగన్‌మోహన్‌రెడ్డికి అనిల్‌ కృతజ్ఞతలను తెలియజేశారు.

పరీక్షలకు 655 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్‌ పరీక్షకు 655 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్‌ మధుమతి తెలిపారు. 5289 మందికి గానూ 4634 మంది హాజరయ్యారని చెప్పారు.

మైనింగ్‌ శాఖ డీడీ బాధ్యతల స్వీకరణ



చంద్రశేఖర్‌

నెల్లూరు(సెంట్రల్‌): మైనింగ్‌ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా చంద్రశేఖర్‌ నెల్లూరు ఆటోనగర్‌లోని కార్యాలయంలో బాధ్యతలను గురువారం స్వీకరించారు. అధికార పార్టీ నేతల తీరుతో ఆయన్ను ప్రభుత్వానికి కలెక్టర్‌ ఇటీవల సరెండర్‌ చేశారు. ఈ అంశాన్ని న్యాయస్థానం తప్పుపట్టడంతో తిరిగి ఆయన్ను డీడీగా ప్రభుత్వం నియమించింది.

జిల్లా ప్రత్యేకాధికారిగా కోన శశిధర్‌

నెల్లూరు(అర్బన్‌): జిల్లా ప్రత్యేకాధికారిగా పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌ను నియమిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం గురువారం జారీ చేసింది. ఇప్పటి వరకు జిల్లా ప్రత్యేకాధికారిగా వ్యవహరించిన ఐఏఎస్‌ హరి కిరణ్‌ తెలంగాణ క్యాడర్‌కు వెళ్లారు. దీంతో కోన శశిధర్‌ను నియమించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు.. ప్రకృతి వైపరీత్యాల సమయంలో చేపట్టాల్సిన చర్యలు తదితరాలను ఆయన పర్యవేక్షించనున్నారు.

చీటింగ్‌ కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

నెల్లూరు సిటీ: డాక్యుమెంట్‌ ఫోర్జరీ కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ నెల్లూరు స్పెషల్‌ ఎక్సైజ్‌ కోర్టు జడ్జి సుయోధన్‌ గురువారం తీర్పు చెప్పారు. వివరాలు.. నెల్లూరు రూరల్‌ మండల పరిధిలోని గుడిపల్లిపాడులో గల ఓ స్థలానికి ఫోర్జరీ డాక్యుమెంట్‌ను ముత్తుకూరు మండలం పంటపాళేనికి చెందిన మోహన్‌రెడ్డి సృష్టించారు. దీనికి నెల్లూరు తహసీల్దార్‌ కార్యాలయంలోని అవుట్‌సోర్సింగ్‌ ఉద్యోగి శ్రీనివాసులు సహకరించారు. ఫోర్జరీ డాక్యుమెంట్‌తో స్థలాన్ని మరొకరికి విక్రయించారు. విషయం తెలుసుకున్న యజమాని ఆదిశేషారెడ్డి నెల్లూరు రూరల్‌ పోలీస్‌స్టేషన్లో అప్పట్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో ఏ – 1 మోహన్‌రెడ్డి, ఏ – 2 శ్రీనివాసులుకు మూడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.40 వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. కాగా కోర్టు విచారణకు మోహన్‌రెడ్డి గైర్హాజరయ్యారు.

నేత్రపర్వంగా శీవేలి ఉత్సవం

నెల్లూరు(బృందావనం): మండల పూజలను పురస్కరించుకొని నగరంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో శీవేలి ఉత్సవాన్ని నేత్రపర్వంగా గురువారం నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా బట్టీపాటి ప్రసాద్‌, మాధవి, ఈశ్వర్‌రెడ్డి, పద్మ, అక్కెంరెడ్డి జనార్దన్‌రెడ్డి, సుమతి తదితరులు వ్యవహరించారు.

వ్యక్తిపై హత్యాయత్నం


నెల్లూరు(క్రైమ్‌): వ్యక్తిపై పాత నేరస్తుడు కత్తితో దాడి చేసిన ఘటన డైకస్‌ రోడ్డులోని ఓ బార్‌ అండ్‌ రెస్టారెంట్‌ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. డైకస్‌ రోడ్డులోని ఎన్సీటీ కాలనీకి చెందిన కరిముల్లా ఆటో పెయింట్‌ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఓ బార్‌ సమీపంలో ఆయన ఉండగా, అదే ప్రాంతానికి చెందిన పాత నేరస్తుడు యాసిర్‌ అక్కడికొచ్చారు. ఈ తరుణంలో కరిముల్లాపై కత్తితో దాడి చేసి పరారయ్యారు. గాయపడిన కరిముల్లాను నారాయణ హాస్పిటల్‌కు తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. కాగా యాసిర్‌పై ఇప్పటికే పలు కేసులున్నాయని పోలీసులు తెలిపారు.

రైతన్నను నట్టేట ముంచి

రైతు భరోసా ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చే రూ.13,500 మొత్తాన్ని తమ పార్టీ అధికారంలోకి వస్తే రూ.20 వేలకు పెంచుతామంటూ గత ఎన్నికలకు ముందు ప్రచార సభల్లో టీడీపీ అధినేత చంద్రబాబు ఊదరగొట్టారు. సూపర్‌సిక్స్‌ పేరిట రూపొందించిన హామీల కరపత్రాన్ని చేతపట్టుకొని ఆయన సాగించిన హడావుడి అంతా ఇంతా కాదు. గతం సంగతి దేవుడెరుగు.. ఈసారైనా వీటిని పక్కాగా అమలు చేస్తారని ఆశించి పట్టం కట్టిన ప్రజలకు తన నిజస్వరూపాన్ని చూపుతున్నారు. అధికారం చేజిక్కించుకొని ఆర్నెల్లవుతున్నా, ఏ పథకాన్నీ సక్రమంగా అమలు చేయడకుండా పంగనామాలు పెడుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు.. అందని పెట్టుబడి సాయం.. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు దక్కకపోవడం.. బీమా ప్రీమియం భారం.. ఇలా అన్నదాతల కష్టాలు నానాటికీ తీవ్రమవుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఎంతో బాగుండేదని.. నేడు ఆ పరిస్థితే లేదని రైతులు పేర్కొంటున్నారు.

- అన్నదాత సుఖీభవ అంటూ నాడు ప్రగల్భాలు
- ఆ పదమే తెలియదనే రీతిలో నేడు నాటకం
- కర్షకులపై బీమా ప్రీమియం పిడుగు
- అస్తవ్యస్తంగా ధాన్యం కొనుగోళ్లు

- అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత నేడు



జిల్లాలో ఇలా..

అన్నదాత సుఖీభవ లబ్ధిదారులు - 2,44,757 మంది

ఏడాదికి ఒక్కొక్కరికీ ఇస్తామన్న మొత్తం - రూ.20 వేలు

తొలి సంవత్సరం ఇవ్వాల్సింది - రూ.489.5 కోట్లు

ఇచ్చింది - 0

కావలి: టీడీపీ 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న సమయంలో అన్నదాతలు అష్టకష్టాలు పడ్డారు. వర్షాలు సమృద్ధిగా లేకపోవడం.. ప్రభుత్వం నుంచి కొరవడిన సహకారంతో వ్యవసాయాన్నే మానేయాలనుకునే స్థితికి రైతులు చేరారు. సాయమందించాల్సింది పోయి వ్యవసాయమే దండగ అనే రీతిలో నాటి సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించడం వీరిని మరింత కలవరపాటుకు గురిచేసింది. ఈ తరుణంలో ప్రజాసంకల్ప యాత్ర పేరిట రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసిన వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి కర్షకుల కష్టాలను దగ్గర్నుంచి చూసి వారి జీవనోన్నతికి ప్రణాళికలను రూపొందించారు. 2019లో అధికారంలోకి వచ్చి సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే పలు విప్లవాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అన్నదాతను ఆదుకునేందుకు రైతు భరోసా పథకం.. ఆర్బీకేలను ఏర్పాటు చేసి భూసార పరీక్షల మొదలుకొని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సకాలంలో అందించడంతో పాటు వాటినే కొనుగోలు కేంద్రాలుగా మార్చడంతో రైతన్నలు రారాజులుగా వెలుగొందారు. పంట బీమాను ఉచితంగా కల్పించడంతో పాటు ప్రకృతి విపత్తులతో పంట నష్టపోతే పరిహారం అందించడంలోనూ ఇవి కీలకంగా ఉండేవి. అయితే ప్రస్తుతం అన్నదాత సుఖీభవ పథకంపై ఎలాంటి విధివిధానాలను ఖరారు చేయకపోవడం.. పైసా సాయం అందకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

కర్షకులు కుదేలవుతున్నారు



పెట్టుబడి సాయంగా రూ.20 వేలను ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పారు. ఆయన అధికారంలోకి వచ్చాక ఖరీఫ్‌ పూర్తయి రబీ మొదలైంది. నేటికీ ఒక్క పైసా జమకాలేదు. గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సీజన్‌ ప్రారంభానికి ముందే రైతుల ఖాతాల్లో రూ.13,500 జమయ్యేవి. ప్రస్తుతం ఆ సాయమే లేకుండా పోయింది. ఆర్బీకేలు మూతపడ్డాయి.

– ఇనమడుగు శివరామిరెడ్డి, రైతు నేత, కావలి

అప్పులపాలవుతున్న రైతన్న



గత ప్రభుత్వ హయాంలో పంట సాగు సమయంలో పెట్టుబడి సాయంగా రైతు భరోసాను అందజేసేవారు. దీంతో సన్నకారు రైతులు ఎంతో సంతోషంగా సాగుచేసేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆర్థిక భరోసా కరువైంది. హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలి.

– వెంకటశేషయ్య, కోవూరు

ఆడబిడ్డ నిధి

లబ్ధిదారులు - పది లక్షలు (సుమారు)
నెలకు ఇవ్వాల్సింది - రూ.1500
మొత్తం నిధులు - రూ.150 కోట్లు (నెలకు)

తల్లికి వందనం

జిల్లాలో అర్హులు - 4,10,799
ఏటా ఇవ్వాల్సింది - రూ.15 వేలు
అందించాల్సిన మొత్తం: రూ.616.20 కోట్లు (ఏడాదికి)

గ్యాస్‌ సిలిండర్లు

ఎంత మంది అంటే - 7,33,520
ఈ ఏడాది ఇవ్వాల్సింది - 3
ఇచ్చింది - 1

నిరుద్యోగ భృతి

నిరుద్యోగులు - నాలుగు లక్షలు
నెలకు ఇవ్వాల్సింది - మూడు వేలు
అందించాల్సింది - రూ.120 కోట్లు

బస్సు ప్రయాణం

లబ్ధిదారులు - పది లక్షలు (సుమారు)

నేడు.. ష్‌.. గప్‌చుప్‌

అధికారమే పరమావధిగా ఆచరణ సాధ్యం కాని హామీలను చంద్రబాబు మరోసారి గుప్పించారు. చంద్రబాబు ష్యూరిటీ – భవిష్యత్తు గ్యారంటీ అంటూ మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి ఆర్నెల్లవుతున్నా, నేటికీ దేన్నీ అమలు చేయలేదు. సూపర్‌ సిక్స్‌ అనే మాటనే ప్రస్తుతం విస్మరించారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

రైతులకు అండగా.. ఆందోళన బాట నేడు

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతుల కోసం ఆందోళన బాటను శుక్రవారం నిర్వహించనున్నామని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని వీఆర్సీ కూడలిలో గల అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పించి, అనంతరం కలెక్టరేట్‌ వరకు ర్యాలీగా వెళ్లనున్నామని చెప్పారు. తదుపరి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించనున్నామని తెలిపారు. పార్టీ శ్రేణులు, అన్నదాతలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

అన్ని వర్గాలకూ పంగనామాలే..

- ప్రతి మహిళకూ నెలకు రూ.1500 చొప్పున ఇస్తాం.. ఎంత మంది ఉంటే అందరికీ ఈ మొత్తం వర్తిస్తుంది.. ఎలాంటి ఆంక్షలు ఉండబోవంటూ నాడు ఊదరగొట్టారు. ఈ మొత్తాన్ని బ్యాంక్‌ ఖాతాల్లో జమచేస్తామనీ ప్రకటించారు. అయితే దీనిపై ఎలాంటి అడుగూ ముందుకుపడలేదు.
- అమ్మఒడి కంటే మిన్నగా తల్లికి వందనాన్ని అమలు చేస్తా.. ఒక బిడ్డ ఉంటే రూ.15 వేలు.. ఇద్దరుంటే రూ.30 వేలు.. ముగ్గురుంటే రూ.45 వేలు.. ఇలా ఎంత మంది ఉంటే అందరికీ వర్తింపజేస్తానని చంద్రబాబు ప్రకటించారు. పిల్లలను బాగా చదివిస్తే ప్రపంచాన్ని శాసిస్తారని, అందుకే ఈ పథకాన్ని రూపొందించానని డబ్బా కొట్టినా, నేటికీ అతీగతీ లేదు.
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణమని ఎన్నికల సమయంలో బాబు గారి గారడీ ఓ స్థాయిలో సాగింది. అధికారంలోకి వచ్చి నెలలవుతున్నా, ఈ ఉచిత బస్సు కనుచూపు మేరలో కనిపించడంలేదు.
- నిరుద్యోగ భృతిగా నెలకు రూ.మూడు వేలిస్తా.. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు.. మెగా డీఎస్సీ.. ఇలా హామీల వర్షాన్ని కురిపించారు. అయితే భృతీ లేక.. ఉద్యోగాల భర్తీ దిశగా ఎలాంటి కసరత్తూ సాగక.. డీఎస్సీ అనే పదం వినక నిరుద్యోగులు అయోమయానికి గురవుతున్నారు.

కట్టలు తెంచుకుంటున్న ప్రజాగ్రహం

- అన్ని వర్గాల్లో పెరిగిన అసంతృప్తి
- నిత్యం ఆందోళనలు.. ధర్నాలు
- గందరగోళంగా ప్రభుత్వ పాలన

నెల్లూరు(అర్బన్‌): కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఆర్నెల్లవుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో దేన్నీ పూర్తిగా అమలుచేయడంలేదు. దీంతో అన్ని వర్గాల్లో అసంతృప్తి పెరిగింది. కార్మిక, కర్షక, కూలీలు, ఉద్యోగులు, స్కీమ్‌ వర్కర్లు, కాంట్రాక్ట్‌, అవుట్‌సోర్సింగ్‌ సిబ్బంది, అంగన్‌వాడీలు, వలంటీర్లు.. ఇలా ప్రతి ఒక్కరూ హామీలను అమలు చేయాలని కోరుతూ రోడ్డెక్కుతున్నారు. కలెక్టరేట్‌ వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నారు. మాయమాటలతో ప్రభుత్వం తమను వంచిస్తోందని మండిపడుతున్నారు.

ధర్నాలతో దద్దరిల్లుతూ..

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌, విద్యా, వసతిదీవెన నిధులను తక్షణమే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ వద్ద ధర్నాను సెప్టెంబర్‌ 23న చేపట్టారు.
- సమస్యలను పరిష్కరించడంతో పాటు సమాన పనికి సమాన వేతనాన్ని ఇవ్వాలని, కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నారని ఆరోపిస్తూ జాతీయ కార్మిక సంఘ ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ వద్ద బ్లాక్‌ డే నిరసనను అదే రోజున చేపట్టారు.
- ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలంటూ అఖిల భారత రైతు కూలీ సంఘ ఆధ్వర్యంలో ధర్నాను సెప్టెంబర్‌ 30న నిర్వహించారు.
- తమపై రాజకీయ వేధింపులను ఆపాలని కోరుతూ కలెక్టరేట్‌ వద్ద ఆశ కార్యకర్తలు అదే రోజున నిరసన తెలియజేశారు. గ్రామాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఆశ వర్కర్లను టీడీపీ అనుకూల సర్పంచ్‌ల ఒత్తిడితో తొలగించడం దుర్మార్గమని పేర్కొన్నారు.
- ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ధర్నాను అక్టోబర్‌ ఏడున జరిపారు.
- ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమకు నెల నెలా జీతాలివ్వాలని, 108 వాహనాలను ప్రభుత్వమే నిర్వహించాలని, ఇంక్రిమెంట్లు, జీతాలను పెంచాలని డిమాండ్‌ చేస్తూ 108, 104 ఉద్యోగులు ధర్నాను నవంబర్‌ 18న చేపట్టారు.
- జీతాన్ని రూ.పది వేలకు పెంచాలని, ఇప్పటి వరకు రావాల్సిన వేతనాలను తక్షణమే ఇవ్వడంతో పాటు కక్షసాధింపు చర్యలను విడనాడాలని కోరుతూ కలెక్టరేట్‌ వద్ద వలంటీర్లు ధర్నాను నిర్వహించారు.



సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల ఆందోళన (ఫైల్‌)



వలంటీర్ల నిరసన (ఫైల్‌)

వసతిగృహాల మరమ్మతులకు ప్రతిపాదనలు



సూచనలు చేస్తున్న శ్రీనివాసులు

సంగం: జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతిగృహాల మరమ్మతులకు రూ.10 కోట్లతో ప్రతిపాదనలను పంపగా, ఇందులో రూ.ఎనిమిది కోట్లకు ఆమోదం లభించిందని సోషల్‌ వెల్ఫేర్‌ డిప్యూటీ డైరెక్టర్‌ శ్రీనివాసులు పేర్కొన్నారు. సంగంలోని ఎస్సీ బాలికల వసతిగృహాన్ని ఆకస్మికంగా గురువారం తనిఖీ చేసిన ఆయన వసతులను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలతో హాస్టల్లో వర్షపు నీరు, మురుగు నిల్వ ఉండటాన్ని గమనించి, వీటిని వెంటనే తొలగించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి నరసయ్యకు సూచించారు. వర్షపు నీరు చేరితే విద్యార్థులను స్థానిక బీసీ బాలికల వసతిగృహానికి తరలించాలని తెలిపారు. ఏఎస్‌డబ్ల్యూఓ బ్రహ్మానందాచారి, వార్డెన్‌ హనుమాయమ్మ, వెల్ఫేర్‌ అసిస్టెంట్‌ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు సాధించలేకపోతే ఉద్యోగం వదిలేయండి



సమీక్ష నిర్వహిస్తున్న గంగాభవానీ

- ఉపాధి సిబ్బందిపై డ్వామా పీడీ మండిపాటు

ఉదయగిరి: ఉపాధి పనుల లక్ష్యాలను సాధించలేకపోతే ఉద్యోగం వదిలేసి వేరే పని చూసుకోండి.. కథలు చెప్పొద్దు.. చేతకాకపోతే కొత్త వారిని నియమించుకుంటామని డ్వామా పీడీ గంగభవానీ స్పష్టం చేశారు. ఉపాధి పథకంపై ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బందితో ఉదయగిరిలో క్లస్టర్‌ స్థాయిలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె ఘాటైన వ్యాఖ్యలు చేశారు. మండలాల వారీగా పనుల పురోగతిపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రభుత్వానికి మెటీరియల్‌ నిధులు రావాలంటే కూలీల పనిదినాలను తప్పక పూర్తి చేయాలని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గానూ ఇప్పటివరకు 70 శాతం పని దినాలను పూర్తి చేశామని, మిగిలిన దాన్ని మార్చిలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి షోకాజ్‌ నోటీసులను జారీ చేస్తామని తెలిపారు. లక్ష్యసాధనలో వెనుకబడిన వారిని గుర్తించి ఈ నెలాఖరులో ఉద్యోగం నుంచి తొలగిస్తామని పేర్కొన్నారు. జాబ్‌ కార్డు ఉన్న ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు పని కల్పించాలని సూచించారు. ఏపీడీ గాయత్రిదేవి, ఎంపీడీఓ అప్పాజీ, ఏపీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పనికీ.. ఓ రేటు



ఆర్టీఏ కార్యాలయం



ఆఫీస్‌ బయట ఏజెంట్ల షాపులు

- రవాణా శాఖలో వసూళ్ల బాగోతం
- దళారుల ద్వారా వెళ్తే చకచకా
- పేరుకుపోతున్న దరఖాస్తులు
- సమాధానం చెప్పేవారేరీ..?
- ఇదీ నెల్లూరు ఆర్టీఏలో పరిస్థితి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వసూళ్ల దందాకు నెల్లూరు రవాణా కార్యాలయం అడ్డాగా నిలుస్తోంది. వాస్తవానికి అన్నీ ఆన్‌లైన్‌ అని అధికారులు పేర్కొంటున్నా, ప్రతి పనికీ ఓ రేటును నిర్దేశించి వసూలు చేస్తున్నారు. ఏజెంట్ల ద్వారా భారీగా ఆర్జిస్తున్నారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్నా, అనేక కొర్రీలు పెట్టి వాటిని పెండింగ్‌లో ఉంచుతున్నారు.

భిన్నమైన పరిస్థితి

అన్ని సేవలను కేంద్ర ప్రభుత్వం సులభతరం చేసింది. అన్ని రాష్ట్రాలకు సంబంధించి పరివాహన్‌ సేవ అనే వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో కొన్ని సేవలను ఇంటి నుంచే చేసుకోవచ్చు. రవాణా శాఖ కార్యాలయం లేదా ఏజెంట్‌ను సంప్రదించాల్సిన అవసరమే ఇందులో ఉండదు. అయితే నెల్లూరులో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా మారింది.

ఓకే చేయక.. పెండింగ్‌లో

డ్రైవింగ్‌ లైసెన్స్‌ రెన్యువల్‌కు సైతం కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరమే లేదు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, తమ వివరాలను నమోదు చేసి ఎంటర్‌ చేయగానే ఆధార్‌ సీడింగ్‌ అడుగుతుంది. దీనికి రవాణా శాఖ కార్యాలయంలో ఓకే చేయాల్సి ఉన్నా, అలా జరగడంలేదు. అన్నీ సక్రమంగా ఉన్నా, నెలల తరబడి ఇదే పరిస్థితి నెలకొంటోంది. దరఖాస్తుదారుడు కార్యాలయానికి వెళ్తే అప్పుడు చేస్తున్నారు.

తేడాలుంటే అంతే..

ఆధార్‌, డ్రైవింగ్‌ లైసెన్స్‌లో పుట్టిన తేదీ వేరుగా ఉంటే ఇక అంతే సంగతులు. వీటిని తిరస్కరించడమో.. లేక పెండింగ్‌లోనో ఉంచుతున్నారు. కార్యాలయానికి వెళ్లి ప్రశ్నిస్తే, పుట్టిన తేదీ వేరుగా ఉంది.. మార్చుకోమని సలహా ఇస్తున్నారు. వాస్తవానికి పుట్టిన తేదీని లైసెన్స్‌లో మార్చుకునే వెసులుబాటు లేదు. గతంలో మాన్యువల్‌గా వారికి తోచిన పుట్టిన తేదీని రవాణా శాఖ అధికారులు నమోదు చేసేవారు. ఆధార్‌కార్డుల జారీ సమయంలోనూ కొన్ని సందర్భాల్లో ఇదే తరహా పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిణామాల క్రమంలో గత్యంతరం లేక ఏజెంట్లను ఆశ్రయిస్తున్నారు. వారు క్షణాల్లో ఆధార్‌ సీడింగ్‌ చేస్తుండటం గమనార్హం. దీనికి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు.

వసూళ్లు ఇలా..

ఎల్‌ఎల్‌ఆర్‌ పరీక్షకు - రూ.వెయ్యి	డ్రైవింగ్‌ టెస్ట్‌కు - రూ.1500
ఆటో ఫిట్‌నెస్‌ (మోడల్‌ బట్టి) - రూ.750 నుంచి రూ.1500	
పక్క రాష్ట్ర వెహికల్‌ రిజిస్ట్రేషన్‌ - రూ.మూడు వేల నుంచి రూ.ఐదు వేలు	

అన్నీ సిత్రాలే..

ఎల్‌ఎల్‌ఆర్‌కు దరఖాస్తు చేసుకున్నాక, ఆన్‌లైన్లో పరీక్ష రాయాలి. అయితే దీన్ని రవాణా శాఖ కార్యాలయ సిబ్బందే రాస్తారు. కార్యాలయంలో ఒక్కో విభాగానికి ఒక్కొక్కర్ని ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ డబ్బులు తీసుకుంటే ఇబ్బందులొస్తాయని, కార్యాలయ బయట షాపులు పెట్టుకున్న వారికి ఆ బాధ్యతలను అప్పగించారు. ఎల్‌ఎల్‌ఆర్‌.. డ్రైవింగ్‌ లైసెన్స్‌.. ఫిట్‌నెస్‌.. ఇలా పలువుర్ని ఏర్పాటు చేసుకున్నారు. వారి వద్దకెళ్లి నగదు చెల్లిస్తే పెన్సిల్‌తో నంబర్‌ను వేసిస్తారు. దీన్ని లోపలికి తీసుకెళ్తే అన్నీ వారే చూసుకుంటారు. రోజూ సాయంత్రం ఏజెంట్ల వద్దకు కార్యాలయ సిబ్బంది వచ్చి తమ కలెక్షన్‌ను తీసుకెళ్తారని పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.



నగరాన్ని కమ్మేసిన పొగమంచు



రాపూరులో రోడ్డుపై వర్షపునీరు



నెల్లూరు నగరంలో



సైదాపురం: కైవల్యా నది పరవళ్లు

రోజంతా ముసురు

- అల్పపీడన ప్రభావంతో వర్షాలు
- అత్యధికంగా రాపూరులో 97.8 మి.మీ. వర్షపాతం

నెల్లూరు(అర్బన్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ముసురు వాతావరణం నెలకొంది. తేలికపాటి జల్లులు కురుస్తున్నాయి. రెండు, మూడుచోట్ల భారీవర్షాలు నమోదయ్యాయి. గురువారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అత్యధికంగా రాపూరు మండలంలో 97.8 మి.మీ. వర్షం కురిసింది. సైదాపురంలో 37.4, మనుబోలు 19.2, నెల్లూరు అర్బన్‌లో 13.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. 20 మండలాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. సరాసరి వర్షపాతం 6.4 మి.మీ.గా నమోదైంది. నెల్లూరు నగరం చిత్తడిగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రధాన రోడ్లు గుంతలమయమయ్యాయి. ఇంత వరకు వాటి గురించి పట్టించుకోలేదు. ప్రస్తుతం కురిసే వర్షాలకు మరింతగా రహదారులు ఛిద్రమవుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సైదాపురం మండలంలో కైవల్యా నదికి వరద ప్రవాహం పెరుగుతోంది.

క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ, ఆ పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి గురువారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లూరుకు సంబంధించిన పలు అంశాలను జగన్ దృష్టికి తీసుకెళ్లారు. అధినేత సూచనలు పాటిస్తూ సిటీలో పార్టీని బలోపేతం చేస్తామని ఎమ్మెల్సీ తెలియజేశారు.

బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో ఏడీఆర్‌ఎం తనిఖీలు

బిట్రగుంట: బిట్రగుంట రైల్వేస్టేషన్‌ను విజయవాడ రైల్వే డివిజనల్ ఏడీఆర్‌ఎం కె.శ్రీనివాసులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ విభాగాలను, రికార్డులను పరిశీలించి పలు సూచనలిచ్చారు. ప్రయాణికులకు కల్పిస్తున్న వసతులు, పారిశుద్ధ్యం తదితర అంశాలను పరిశీలించారు. ఆయన వెంట వివిధ విభాగాలకు చెందిన రైల్వే అధికారులున్నారు. కాగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి సీనియర్ డీఈఎన్ కేడీఎస్ కృష్ణతో కలిసి బోగోలులోని 143, 144వ రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్లను పరిశీలించారు. 144వ నంబర్ ఎల్‌సీ గేటు వద్ద ప్రయాణికుల వెతలు తీర్చేలా ఫ్లై ఓవర్, 143వ నంబర్ ఎల్‌సీ గేటు వద్ద బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మాణంపై డీఈఎన్, ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చించారు.

కళాశాల సమీపంలో కొండచిలువ

- పట్టుకుని అడవిలో వదిలిన యువకులు



కొండచిలువను చూపుతున్న స్థానికుడు

కలువాయి: మండల కేంద్రమైన కలువాయిలో శివసాయి కళాశాల సమీపంలో బుధవారం రాత్రి పది అడుగుల పొడవైన కొండచిలువను స్థానిక యువకులు చూశారు. వెంటనే దానిని పట్టుకుని సమీపంలోని అడవిలో వదిలి పెట్టారు. భారీ కొండచిలువను చూసి ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ప్రాంతంలోని వారు పెంచుకుంటున్న కోళ్లు ఇటీవల మాయమవుతున్నాయి. ఏమై ఉంటుందో అని ఆందోళన చెందుతున్న తరుణంలో కొండచిలువను అడవిలో వదిలేయడంతో ఊపిరి పీల్చుకున్నారు.

అడిగేదెవరు.. ఆపేదెవరు!

- ఆత్మకూరు నియోజకవర్గంలో బరితెగించిన తెలుగు తమ్ముడు
- యథేచ్ఛగా ప్రభుత్వ భూమి ఆక్రమణ
- 40 ఏళ్ల క్రితం తెలుగుగంగ కార్యాలయం ఏర్పాటు
- దాని ముందు భాగంలో దుకాణ నిర్మాణం



ఆక్రమిత స్థలంలో చేపట్టిన నిర్మాణం

ఆత్మకూరు: అది ప్రభుత్వ కార్యాలయానికి సంబంధించిన స్థలం. దీనిని ఓ తెలుగు తమ్ముడు దర్జాగా ఆక్రమించి వ్యాపార గదిని నిర్మిస్తున్నాడు. అధికారం చేతిలో ఉండటంతో ఎవరూ అడగరనే ధైర్యంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడు. నాలుగు దశాబ్దాల క్రితం కండలేరు జలాశయం నిర్మాణంలో భాగంగా తెలుగుగంగ కార్యాలయాన్ని చేజర్ల మండలం ఆదూరుపల్లి గ్రామ నడిబొడ్డున సర్వే నంబర్ 365/డీలో ఏర్పాటు చేశారు. అప్పట్లోనే దీని కోసం 5.12 ఎకరాలు కేటాయించారు. కాలక్రమేణ ప్రాజెక్ట్‌ల నిర్మాణాల అనంతరం కార్యాలయం ప్రాధాన్యత తగ్గింది. 2010లో హైస్కూల్ నిర్మాణం కోసం ఆ స్థలంలోని 2.76 ఎకరాలను మంజూరు చేశారు.

వ్యాపార కేంద్రం

ఆదూరుపల్లి గ్రామం వ్యాపారాలకు కీలకంగా ఉంది. దీంతో ఈ ఇక్కడ స్థలాలకు డిమాండ్ ఉంది. పొదలకూరు – కలువాయి మార్గంలోని పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న తెలుగుగంగ కార్యాలయం ముందు భాగంలో ఉన్న స్థలాన్ని స్థానిక టీడీపీ నాయకుడు ఆక్రమించాడు. తొలుత పూరి గుడిసె నిర్మించి చిన్నపాటి దుకాణం ఏర్పాటు చేయించాడు. ప్రభుత్వ శాఖల సమన్వయలోపం ఆక్రమణదారుడికి వరంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ స్థలం తెలుగుగంగ కార్యాలయానిదని, కాదు ఆర్‌అండ్‌బీకి చెందిందని, కాదు రెవెన్యూ భూమి అని ఇలా రకరకాలుగా ప్రచారంలో ఉంది.

ప్రభుత్వ స్థలానికి ఎన్‌ఓసీ

వ్యాపారం నిర్వహించుకునేందుకు విద్యుత్ కనెక్షన్ కోసం ఆక్రమణదారుడు పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోగా ఆ స్థలానికి ఎన్‌ఓసీ ఇవ్వడం గమనార్హం. పలువురు చిన్న దుకాణదారులు రోడ్డు వెంబడి బంకులు ఏర్పాటు చేసుకుని విద్యుత్ కనెక్షన్ కోసం ఎన్‌ఓసీ అడిగితే ఇచ్చేందుకు నిరాకరించిన కార్యదర్శి టీడీపీ నేతకు మాత్రం ఇచ్చాడు. విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే నేత దుకాణానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంపై విమర్శలున్నాయి. తాజాగా సదరు నాయకుడు గుడిసెను తొలగించి మూడురోజుల నుంచి రేకులతో దుకాణం కట్టిస్తున్నాడు.

అధికారుల నిర్లక్ష్యం

ప్రభుత్వ స్థలం ఆక్రమించడం నేరమని, నిర్మాణం ఆపేయాలని నేతకు తెలుగుగంగ ప్రాజెక్ట్ అధికారులు గురువారం చెప్పారు. అయితే ఆయన వారి మాటలు పట్టించుకోకపోగా ఆ స్థలంతో మీ శాఖకు ఎలాంటి సంబంధంలేదని ఆర్‌అండ్‌బీ అధికారులు అడిగితే వారికి చెప్పుకొంటానని, ఈ ప్రాంతంలో చాలామంది స్థలాలను ఆక్రమించి గదులు నిర్మించారని ముందు వాటిని తొలగించి తర్వాత తన దగ్గరకు రావాలని సమాధానమిచ్చాడు.

నివేదిక ఇచ్చాం

మా కార్యాలయానికి చెందిన స్థలంలో అక్రమంగా గది నిర్మిస్తున్న విషయం వాస్తవమే. దీనిపై డీఈ, మండల తహసీల్దార్‌కు నివేదిక ఇచ్చాం. రెవెన్యూ అధికారులు పరిశీలించి ఇది ఏ శాఖకు చెందుతుందో తేల్చాల్సి ఉంది.

– ఎస్.వెంకటేశ్వర్లు, తెలుగుగంగ ఏఈ

వివాహిత ఆత్మహత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. జనార్దనరెడ్డికాలనీకి చెందిన పర్వీన్‌కు కోటమిట్టకు చెందిన కాలేషాతో సుమారు పదిహేనేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. కాలేషా ఆటో నడిపే సమయంలో సరిపడా సంపాదన లేకపోవడంతో ప్రస్తుతం బిరియాని మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా దంపతుల నడుమ విభేదాలు పొడచూపాయి. భార్యను కాలేషా వేధిస్తుండటంతో ఆమె పిల్లలను తీసుకుని ఈనెల 9వ తేదీన జనార్దనరెడ్డికాలనీలోని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. 10వ తేదీన కాలేషా అక్కడికి వెళ్లి ఆమెను ఇంటికి రావాలని కోరగా నిరాకరించడంతో దాడి చేశాడు. అడ్డుకోబోయిన పర్వీన్ తండ్రిపై సైతం దాడి చేసి వెళ్లిపోయాడు. అదేరోజు సాయంత్రం కాలేషా తన పక్కింటి వారిని తీసుకొచ్చి భార్యాపిల్లలను ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ ఏం జరిగిందో గానీ బుధవారం తెల్లవారుజామున పర్వీన్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన భర్త, అత్తింటివారు ఆమెను చికిత్స నిమిత్తం నారాయణ హాస్పిటల్లో చేర్పించారు. పర్వీన్ తండ్రి ఖాదర్‌బాషా గురువారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీడని 'రాళ్లపాడు' కష్టాలు

- ఐదోరోజూ పైకి లేవని కుడికాలువ గేటు
- అధికారుల ప్రయత్నాలు విఫలం
- సాగునీటి కోసం అన్నదాతల ఎదురుచూపులు



ప్రాజెక్ట్ వద్ద అన్నదాతలు

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్ట్ కుడికాలువ గేటును తీసేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు ఐదోరోజు కూడా విఫలమయ్యాయి. కాలువ నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తుండగా గేటుకు ఉన్న రాడ్ ఊడిపోయి నీటిలో పడిపోయిన సంగతి తెలిసిందే. నాలుగు రోజులుగా రోప్‌లు, చైన్ బ్లాక్‌లతో అధికారులు, మెకానిక్‌లు, సిబ్బంది విశ్వ ప్రయత్నాలు చేసినా గేటు రాకపోగా రోప్‌లు, చైన్ బ్లాక్‌లు తెగిపోయాయి. చివరకు చైన్ బ్లాక్‌లకు వేసిన ఇనుప రాడ్లు కూడా వంగిపోయాయి. విజయవాడ, నాగార్జునసాగర్ నుంచి మెకానిక్‌లు వచ్చి గేటును లేపేందుకు ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. దీంతో గురువారం చీఫ్ ఇంజినీర్ శ్యామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో వైజాగ్ నుంచి నీటిలో గేటుకు వెల్డింగ్ చేసే టెక్నీషియన్లను రప్పించారు. మధ్యాహ్నం మూడు గంటలకు వారు ఆక్సిజన్ సిలిండర్ల సాయంతో లోపలికి వెళ్లి గేటును పరిశీలించి పైకి వచ్చారు. గేటుకు వెల్డింగ్ చేసే అవకాశం లేదని, ఒకవేళ పూనుకుంటే చేసే వ్యక్తిని ఆ గేటు నుంచి నీరు అవతలికి లాగేస్తుందని, ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని వారు తెలిపారు. గేటుకు వెల్డింగ్ చేయడం కుదరదని తేల్చారు.

రైతుల ఆవేదన

వరినాట్లు వేసే రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు దుక్కులు దున్నామని, ప్రాజెక్ట్ నుంచి నీరు విడుదల కాకపోవడంతో దుక్కులు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజుల నుంచి దిగువ ప్రాంత రైతులు ప్రాజెక్ట్ వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని పడిగాపులు కాస్తున్నారు. గురువారం కూడా వచ్చారు. గేటు రాకపోవడంతో ఉసూరుమంటూ వెళ్లిపోయారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రాజెక్ట్ కింద ఈ సంవత్సరం వరి పంట పండుతుందని నార్లు పోశామని, అయితే నీరు విడుదల కాకపోతే బీడు భూములుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని రాళ్లపాడు కుడి కాలువకు నీటిని విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలన

కుడికాలువ గేటును పైకి లేపేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలను కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పరిశీలించారు. చీఫ్ ఇంజినీర్ శ్యామ్‌ప్రసాద్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. త్వరితగతిన గేటును పైకి లేపి ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని ఆదేశించారు.



వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే

జామాయిల్ చెట్ల నరికివేత

రాపూరు: మండలంలోని తూమాయి – డైక్ సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్‌లో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 13 జామాయిల్ చెట్లను నరికివేసినట్లు రేంజర్ రవీంద్రబాబు తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. తూమాయి సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్‌లో చెట్లను నరికి ట్రక్ ఆటోలో తరలిస్తున్నట్లు అటవీ సిబ్బందికి సమాచారం అందడంతో ఘటనా స్థలానికి వెళ్లారు. వీరిని చూసిన గుర్తుతెలియని వ్యక్తులు ఆటోను వదిలి పరారయ్యారు. జామాయిల్ దుంగలను, వాహనాన్ని స్థానిక అటవీ శాఖ క్వార్టర్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రేంజర్ వివరించారు.

కండలేరులో 55.732 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 55.732 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 1,100 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 300, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 96
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 180
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 200
లేయర్ చికెన్ : 187

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.20
సన్నవి : రూ.15
పండ్లు : రూ.8

ఎంవీఐపై ముగిసిన విచారణ

నెల్లూరు(టౌన్): జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఓ ఎంవీఐపై రెండు రోజులుగా జరుగుతున్న విచారణ గురువారంతో ముగిసింది. విచారణాధికారులుగా నియమితులైన రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శివరామ్‌ప్రసాద్, ఏలూరు ఆర్టీఓ కృష్ణారావులు బుధవారం నెల్లూరు రవాణా కార్యాలయానికి వచ్చారు. గతంలో సూళ్లూరుపేటలో ఎంవీఐగా పనిచేస్తున్న ఎస్‌కే బాబు కార్యాలయానికి లైసెన్స్ కోసం వచ్చిన వాహనదారుడిని దూషించాడని కమిషనర్‌కు ఫిర్యాదు అందింది. దీంతోపాటు లారీ ఓనర్లు కూడా ఆయనపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై అప్పటి కమిషనర్ సదరు ఎంవీఐని సస్పెండ్ చేశారు. ఇప్పటికే పలు దఫాలుగా విచారణ జరిగింది. రవాణా అధికారులు పలువురు ఫిర్యాదుదారులను కార్యాలయానికి పిలిపించి విచారించినట్లు తెలిసింది.

అధికారులతో సమీక్ష

జిల్లా రవాణా అధికారులకు ఇచ్చిన లక్ష్యాలను సాధించాలని శివరామ్‌ప్రసాద్ ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఎంవీఐ, ఏఎంవీఐలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి నాటికి లక్ష్యాలను అధిగమించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తిరుగుతున్న వాహనాలపై కేసులు నమోదు చేయాలన్నారు. అదే విధంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. ఓవర్‌లోడ్, అతి వేగం, హెల్మెట్ ధరించకపోవడం, మద్యం తాగి వాహనం నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. సమావేశంలో ఉప రవాణా కమిషనర్ బి.చందర్, ఇన్‌చార్జి ఆర్టీఓ బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఉలవపాడు: జాతీయ రహదారిపై దోపిడీలు చేసే ఇద్దరు దొంగలను కందుకూరు సీఐ కె.వెంకటేశ్వరరావు, ఉలవపాడు ఎస్సై అంకమ్మ గురువారం చాకచక్యంగా పట్టుకున్నారు. వారి కథనం మేరకు.. సీఐ, ఎస్సైలు రాజుపాళెం జంక్షన్ వద్ద తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో ఇద్దరు వ్యక్తులు మోటార్‌బైక్‌పై వస్తుండగా పోలీసులు ఆపి వివరాలు అడిగారు. వారు తడబడగా బైక్‌ను తనిఖీ చేశారు. అందులో కత్తి ఉంది. గట్టిగా ప్రశ్నించడంతో హైవేపై దొంగతనాలు చేస్తుంటామని అంగీకరించారు. వీరిని బోగోలు మండలం అల్లిమడుగు గ్రామ సంఘానికి చెందిన పిరిగ రమేష్, మల్లి దివ్యతేజగా గుర్తించారు. ఈనెల 8వ తేదీన మండల పరిధిలోని వీరేపల్లి జంక్షన్ వద్ద కావలి మండలం చెన్నాయపాళేనికి చెందిన బుట్టి వెంకటరావును కత్తితో బెదిరించి సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లామని ఒప్పుకొని ఫోన్‌ను అప్పగించారు. వీరిపై బిట్రగుంట స్టేషన్‌లో పలు కేసులు ఉన్నాయని ఎస్సై తెలియచేశారు. రమేష్‌పై రౌడీషీట్, దివ్యతేజపై సస్పెక్ట్ షీట్ ఉన్నట్లు వెల్లడించారు. దొంగల్ని పట్టుకున్న సీఐ, ఎస్సైను డీఎస్పీ వెంకట బాలసుబ్రహ్మణ్యం అభినందించారు.